# చీపురు

మాలతికి ఉత్సాహంగా లేదు

ఆ మాటకొస్తే ఇంకా 'ఆయన' మాటలు తనని బాధిస్తున్నాయి కూడా.

ఇదివరకు అలా ఉండేదా ?

కాదు. వాళ్ళు వస్తున్నారంటేనే ఎందుకో తెలీని ఆనందం కలిగేది. ఎప్పుడోగాని తమ ఇంటికి బంధువులు రారు. మరి వాళ్ళు బంధువులు కూడా కాదు. అయినా సరే బంధువులను మించిన అనుభూతి.

నిజానికి వారందరూ వస్తే తనకి ఇంకొంచెం పని. వారి చర్చల్లో తాను ఏ రకంగానూ పాలుపంచుకోలేదు. అయితే వారికి టీలు అందిస్తుంది. టిఫిన్ చేసిపెడుతుంది. భోజనం ఏర్పాట్లు చూస్తుంది.

ఆ మాత్రం దానికే వారిలో ఎంత సంతోషమో !

ఇద్దరు డాక్టర్లు .... ఒకావిడ మాత్రం మహిళా సంఘంలో పని చేస్తారు. రాగానే మాటలే మాటలు. మధ్యలో ఒకసారి ఆవిడవచ్చి 'నేను కూడా సహాయం చేస్తా' అంటారు.

"ఏం అవసరంలేదు. మీరు మాట్లాడుకుంటూ కూర్చుంటే నేను అన్ని ఏర్పాట్లు చూస్తాను" అంటుంది తను.

ఆమె నవ్వుతూ వెళ్తుంది.

రాత్రి సమయంలో మాత్రం అందరూ మేడమీదికి చేరతారు. అప్పుడు ఆమె మధురమైన కంఠంతో పాట పాడుతుంది. అందరూ ఏదో ప్రపంచంలో విహరిస్తున్నట్లుగా కూర్చుంటారు.

రెండు మూడుసార్లు డాక్టరుగారు తనని బలవంతం చేశారు.

'ఏమ్మా నువ్వుకూడా ఓ పాట పాడకూడదా' అని.

తనకు పాటలు రావు.

ఇంతకుముందయితే పాటలు వినాలని కూడా అనిపించేది కాదు. ఇప్పుడలా కాదు ఆ పాటలు బాగుంటున్నాయి.

అందులోనూ వారందరూ కూర్చున్నప్పుడు తను విన్న పాటలు అంతకుముందెప్పుడూ విననివి. మొదట్లో ఎలా అనిపించినా ఇప్పుడవి చాలా బాగుంటున్నాయి.

వారందరూ వెళ్తూ "మేం వస్తే నీకు పనమ్మా. ఎక్కడికి వెళ్ళినా నీ అతిథ్యం గుర్తొస్తుంది మాకు" అంటారు.

అలా అన్నప్పుడు తనకి అంతులేని సంతోషం కలుగుతుంది. తనేం చేసినా వారికి అద్భుతంగా ఉంటుంది.

'నువ్వు 'టీ బాగా చేస్తావమ్మా' అంటారు. ఇన్ని దోసెలు తిన లేకపోతున్నాం ఇక చాలమ్మా—ఇంత రుచిగా చేస్తే ఎలా? అంటారు. రెండు మూడు కూరలు చేస్తే "ఎందుకమ్మా ఇంత శ్రమ పడ్డావని నొచ్చు కుంటారు.

వారామాటలు తనని సంతోషపెట్టడానికి అనరు. ఆ విషయం తను అర్థం చేసుకోగలదు. అయితే మంచి మంచి పుస్తకాలు చదవమంటారు. లేదా అప్పుడప్పుడు సభలు జరిగితే రమ్మంటారు.

ఆ విషయాల్లో మాత్రం తనకి ఇప్పటివరకు ఆసక్తిలేదు. ముందు అవేవీ తనకు అర్థంకావు. ఇల్లు శుభ్రంగా ఉండాలి. అన్నీ వాటి స్థానంలో అవి ఉండాలి. పిల్లలు క్రమశిక్షణతో పెరగాలి. మిగతా విషయాలు తనకి అనవసరం. ఆయనకి ఎలాంటి భావాలున్నా వాటితో తను అంగీకరించలేక పోతున్నా కూడా ఫర్వాలేదు. ఈ విషయంలో ఆయన కూడా ఫర్వాలేదు.

మొదట్లో కొంత బలవంతం చేసేవాడు. తనకు ఇష్టంలేని భావాల మీద హేళనగా మాట్లాడేవాడు. ఇప్పుడంతగా లేదు కొంచెం తగ్గింది.

అయినా కూడా ఉదయమే తను అన్న మాటలు గుర్తుకు వస్తుంటే చాలా కోపంగా ఉంది. తన ఉత్సాహంమీద ఒక్కసారిగా నీళ్ళు పోసినట్లు గానే ఉంది. తనన్నాడు కదా.

"ఇదిగో ఈరోజు చాలా పెద్ద సీరియస్ విషయంమీద చర్చ జరుగుతుంది. మొత్తం ఓ ఎనిమిదిమందివరకు ఉంటారు. మాట్లాడితే నా'కప్పు' లివ్వండి అంటూ రావద్దు. అంతకంటే ముందు చీపురుతో తయారై కొంచెం లేస్తారా ఊడుస్తానంటూ డిస్టర్బ్ చెయ్యొద్దు"

"కప్పులు తీసుకోకపోతే అంత మందికివ్వడానికి మనింట్లో కప్పులున్నాయా?" అంది మాలతి.

"లేకపోతే ఈ పూటకి ఎవరిపైనా తీసుకో"

"ఎవర్నడగమంటారు ?"

"అదంతా నువ్వు చూసుకో.... ముఖ్యంగా చీపురుతో తయారైపోవద్దు" అన్నాడు.

"అదిగో అలా మాట్లాడితేనే చిరాకు" అంది మాలతి.

రోజూ ఈ విషయంలో తగాదా....తనకయితే శుభ్రంగా ఊడ్చి.... నీళ్ళతో శుభ్రం చేయందే నచ్చదు. అంతకుమించి అంట్లన్నీ గుట్టలుగా పడేసి ఒకేసారి తోమాలన్నా చిరాకు కలుగుతుంది.

"కొంచెం ఆగవచ్చుగా" అంటాడు.

ఎంతసేపు ఆగినా తనేగా కడుక్కునేది.

తను బస్స్టాండ్‌కి వెళ్ళాడు. అందరినీ తీసుకురావటానికి. ఇంకొంత మరికొంచెం సేపట్లో వాళ్ళంతా వస్తారు.

ముందు హోటల్లో భోజనం అనుకున్నారు. అంతమందికి ఒక్కచేతిమీదుగా చేయటం కష్టం. అయినా సరే. తను అంగీకరించింది. మీకెందుకు నేను చేస్తాగా అంది. అలాంటిది ఇలానేనా మాట్లాడటం?

'మనిషికి ఎప్పుడూ తన గొడవ తప్పితే ఆలోచించడు' అనుకుంది.

మెల్లగా ఆలోచనల నుండి తేరుకుని....

"ఈ మనిషి విషయం తెలియందేముంది. వాళ్ళు వచ్చేస్తారు" అనుకుంటూ చీపురు అందుకుంది.

ముందు గదులన్నీ ఊడ్చాక, తడిగుడ్డతో గచ్చు తుడిసింది. బాత్ రూంకి వెళ్ళి ముఖం కడుక్కొని, బొట్టు పెట్టుకుంటుండగా బయట రిక్షాలు ఆగిన శబ్దం....

వచ్చేశారు అనుకుంది.

మొత్తం ఎనిమిది మంది. "మాలతీ" అంటూ వచ్చింది మహిళా సంఘం నాయకురాలు. డాక్టర్లుకూడా వచ్చి పలకరించారు. మిగతా వారందరూ కొత్తవారు. మోహన్ అందరికీ మాలతిని పరిచయం చేశాడు.

"నువ్వెందుకు తలనొప్పి పెట్టుకున్నావ్....అందరం హోటల్ కి వెళ్ళే వాళ్ళం కదా" అంది వాసంతి. ఆమె మహిళాసంఘం నాయకురాలు.

"ఎందుకండీ చాలా దూరం. వెళ్ళాలంటే అందరూ రిక్షాల్లో వెళ్ళాలి. తిరిగి రావాలి. ఖర్చు, బోల్డంత టైం పడుతుంది కదా"

ఒక్కదానివి ఎలా చేస్తావ్?"

"నాకేం కాదు. మీరు మాట్లాడండి. పొద్దున్నుంచి ఆయనకి ఒకటే కంగారుగా ఉంది" అంది.

వాసంతి నవ్వుతూ "పిల్లలు స్కూల్ కి వెళ్ళారా?" అంది.

అవును. చిన్నిగాడు మధ్యాహ్నం స్కూలు ఎగ్గొట్టి వచ్చేస్తానన్నాడు. మీతో కబుర్లు చెప్పాలంటూ" అంది.

ఆమె నవ్వుతూ "నేను వస్తా" అంటూ వాళ్ళ దగ్గరకు వెళ్ళింది.

"అప్పుడే సిగరెట్లు మొదలా....బాబూ ఆ కిటికీ తలుపులు తీయండి. మేఘాలు చెదిరిపోతాయి" అంది.

"ముందు 'యాష్ట్రేలు' చూడండి" అన్నారెవరో.

"రెండు ఉండవు. మోహన్ సిగరెట్లు తాగడు కదా. మహాఅయితే ఒకటి ఉంటుంది.

మోహన్ 'యాష్ట్రే' తెచ్చాడు.

మాలతి పక్కింటివారి నడిగి కప్పులు తీసుకుంది. ముందు టీలు అందిస్తే తను వంట కార్యక్రమంలోకి వెళ్ళవచ్చుననుకుంది.

అంతకుముందే తెచ్చిన బిస్కట్స్ పెద్ద ప్లేటులో పోసి తీసుకు వెళ్ళింది.

"తీసుకోండి. టీ తెస్తాను" అంది.

"ఇంక ప్రారంభం....మాలతి ఏమిచ్చినా మాట్లాడకుండా తింటుం డటమే" అన్నారు డాక్టర్.

జానకి టీ తీసుకొచ్చి అందించింది.

ఇంక అటు వెళ్ళడానికి ఆమెకు సమయం కూడా లేదు. పూర్తిగా వంట కార్యక్రమంలో నిమగ్నం అయిపోయింది.

అందరూ టీలు తాగాక తిరిగి సిగరెట్లు వెలిగించారు. అయితే 'యాష్ట్రే' మాత్రం సరిపోవడంలేదు.

మొదట్లో ఆ నుసి 'యాష్ట్రే'లో వేసినా ఆ తర్వాత మాత్రం అలా చేయటం కుదరలేదు.

చర్చ ఆరంభం అయింది.

అంతమంది అక్కడ సమావేశం కావటం వెనకాల వారందరినీ కంగారుపెట్టేంత పరిణామాలే జరిగాయి.

ఇంకేమాత్రం వారు ఉపేక్షించలేనివి. అయితే ఆ విషయంలో అందరి అభిప్రాయాలూ ఒకే విధంగా కూడా లేవు. అలానే అక్కడకు వచ్చినవారం దరూ కూడా రకరకాల భావావేశాలు కలవారు. కొంతమంది భావుకులు... ఒకరిద్దరు వైద్యులు. ఒకాయనకైతే పూర్తిగా ఆవేశం....ఇంకో వ్యక్తికి అన్నీ అనుమానాలే. సహజంగానే వారు మాట్లాడే తీరులో అవన్నీ ప్రతి బింబిస్తున్నాయి.

చర్చ సాధారణంగానే ప్రారంభం అయింది. అక్కడ నుండి మొదలు. మాలతికి వంట కార్యక్రమం నుండి అప్పుడప్పుడు దృష్టిని మరలిస్తున్నవి వారి మాటలే.

"ఎందుకంత బిగ్గరగా మాట్లాడుతున్నారు. వింటానికి పోట్లాడు కున్నట్లుగా ఉంది. మెల్లగా మాట్లాడుకోవచ్చుకదా" అనుకుంది.

అంతలోనే ఇంకోవిధంగా అనిపించింది.

"గొప్ప సమావేశం అని చెప్పాడు కదా. గొప్ప సమావేశాలన్నీ ఇలానే ఉంటాయేమో...." అయినా తనకు ఏం అర్థం అవుతుంది. టీ ఇచ్చి చాలా సేపయిందా .... ఇంకోసారి ఇస్తే బాగుంటుందేమో....ఫర్వా లేదు. కప్పులున్నాయి. అవయినా కడగాల్సిందే. మరాయన ఏమంటాడో? పక్కింటివారు మాత్రం ఎన్ని కప్పులు ఇస్తారు. అయినా కప్పులు అడ గటం ఏం బాగుంటుంది? చూద్దాం ఈసారి టీలు తాగాక ఇంక భోజనాలకు లేస్తారేమో' అనుకుంది మాలతి. రెండోసారి టీలు అందించటానికి వెళ్ళే సరికి వారందరూ చాలా సీరియస్‌గా కనిపించారు. ఒకాయన భీకరంగా ముఖంపెట్టి మాట్లాడుతున్నాడు.

మాలతిని ముందుగా గమనించింది డాక్టర్‌గారే.

"కొంచెంసేపు రిలాక్స్ అవుదాం రామ్మా" అన్నారు.

వాసంతి లేచి ట్రే అందుకుంది.

అందరూ టీలు అందుకున్నారు.

మాలతి లోపలకు వెళ్ళిపోయింది.

'యాష్‌ట్రే' నిండా సిగరెట్ పీకలు పూర్తిగా నిండిపోయాయి.

"నాకిప్పుడు ఈ సిగరెట్స్ మానడం ఎలా అనే విషయంమీద చర్చ ఆరంభించాలని ఉంది" అంది వాసంతి.

"అమ్మా ఆ పని మాత్రం చేయకు" అంటూ కిటికీనుంచి సిగరెట్ పీక బయటకు విసిరాడొకాయన.

"బాగా విసిరారే. మిసైల్‌లా వెళ్ళింది."

"నేను చదువుకునేరోజుల్లో మంచి ఆటగాడ్ని. అది డెవలప్ చేసు కొని ఉంటే దేశం కోసం ఆడుతుండేవాడ్ని" అన్నాడతను.

వాసంతి లేచి వెళ్ళింది.

"ఏం మాలతీ" అంటూ

అక్కడకు వెళ్ళగానే ఆశ్చర్యపోయింది....

"నువ్వు చాలావేగంగా పనులు చేస్తావు మాలతీ...నీ ప్లానింగ్‌చూస్తే నాకు ముచ్చటవేస్తోంది" అంది.

కథా నిలయం
3783

"చిన్నిగాడు మీకోసం ఎదురు చూస్తున్నాడు. వాడు ఎక్కడెక్కడి నుంచో రకరకాల మొక్కలు తెచ్చి పెంచుతున్నాడు. ఇప్పుడు రాగానే అవన్నీ మీకు చూపించి మీరు మెచ్చుకుంటుంటే పొంగిపోవాలనుకుంటున్నాడు.

"అలాగా....నిజమే. తనకి పూలతోట అంటే అంత ఇష్టం. చిన్ని వచ్చాకే చూస్తాను. అది సరే. అవసరం అయితే నన్ను పిలువ్ వస్తాను" అంది.

"ఏం అవసరంలేదు. నేను చూసుకుంటాగా. మీకేమైనా కావల్సి వస్తే నన్ను పిలవండి" అంది మాలతి.

"ఇంకేం అవసరంలేదు. ఈసారి అందరూ భోజనాలకు లేవడమే"

తిరిగి అందరూ చర్చల్లోకి జారిపోయారు.

సిగరెట్లు కిటికీనుండి బయటకు దూసుకుపోతున్నాయి. ఒక్కోసారి అవి చువ్వలకు తగిలి ఇటువైపే పడుతున్నాయి.

దాదాపు అందరి దగ్గరా సిగరెట్లు అయిపోయాయి.

సరిగ్గా ఆ సమయంలోనే గేటు చప్పుడైంది.

మాలతి బయటకు వచ్చి చూసింది.

కళ్ళనిండా ఉత్సాహం నింపుకుని చిన్ని వస్తున్నాడు. వాణ్ణి చూడగానే మాలతికి కూడా సంతోషం కలిగింది. చిన్న చిన్న పనులు వాడు చేస్తాడు.

తను నడిచివచ్చి తన బ్యాగ్ సర్దుకుని తన పూలతోట దగ్గరకు వెళ్ళాడు. తోటంటే అదేం తోటకాదు. చాలా తక్కువ స్థలంలోనే తను మొక్కలు నాటాడు.

"మోహన్, సిగరెట్లు కావాలయ్యా" అన్నారు.

"ఉండండి. చిన్ని వచ్చినట్లున్నాడు. తెప్పిద్దాం" అన్నాడు.

"కాళ్ళు నొప్పిగా ఉన్నాయి" అంటూ ఎవరో లేచి బయటకు నడవబోయారు. ఆ విసురులో కాలు తగిలి టీ కప్పు వేగంగా గోడను తాకింది.

పెద్ద శబ్దం!

కప్పు ముక్కలు ముక్కలుగా మారింది. గోడ మీద టీ మరకలు అసహ్యంగా కనిపిస్తున్నాయి.

"అరెరే!" అంటున్నారెవరో. మాలతికి కూడా ఆ శబ్దం వినిపించి తనకు తెలియకుండానే ఇవతలకు వచ్చింది. కొంపతీసి పక్కవాళ్ళ కప్పు పగిలిపోలేదు కదా!" అని.

అప్పుడే "అమ్మా" అంటూ వచ్చాడు చిన్ని. తన ముఖం వాడి పోయిఉంది. అంతకుమించి పెదవులు వణుకుతున్నాయి. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఏమైంది చిన్నీ!" అంది.

వాడు మాట్లాడలేకపోతున్నాడు.

"చిన్నీ!" అంటూ వచ్చింది వాసంతి.

"తనను పలకరించకపోవడం చూసి "ఏమైంది?" అంది. చిన్నికి ఇంకా దుఃఖం వచ్చింది.

"అయ్యయ్యో...ఏడుస్తున్నావా? నీ పూలతోట చూడాలని వచ్చానయ్యా!" అంటూ చేయి పట్టుకుని వెళ్ళింది.

అక్కడకు వెళ్ళి ఆమె దిగ్భ్రాంతి చెంది చూస్తుండిపోయింది. మొక్కల మీద సిగరెట్‌తో వాతలు పెట్టినట్లుగా ఉంది. కొన్ని పూలు సగంవరకు కాలిపోయాయి. కొన్ని ఆకులూ అంతే. ఆమె మౌనంగా లోపలకు వచ్చింది.

"చూశారా మీరేం చేశారో!"

"ఏం చేశాం."

"మీరు విసిరిన సిగరెట్లు చిన్ని పూలతోటను ధ్వంసం చేశాయ్!"

"నిజమా?"

అందరూ లేచివెళ్ళారు. వారందరికీ ఆ దృశ్యం బీభత్సంగా కని పించింది.

"సారీరా...కిటికీ అవతల మొక్కలున్నాయని తెలియదు. మోహన్ చెప్పి ఉండాల్సింది."

"కానీ నాకు గుర్తు రాలా!"

కొద్దిసేపు నిలబడ్డాక అందరూ మౌనంగా గదిలోకి వెళ్ళారు.

అక్కడో యుద్ధ దృశ్యం...వారందరికీ ఆశ్చర్యంగా ఉంది. తాము ఇంత బీభత్సం చేశారా? మోహన్ ఓ క్షణం చూసి లోపలికి వెళ్ళాడు.

స్వయంగా చీపురు అందుకుని గదంతా శుభ్రంగా ఊడ్చాడు. టీ మరకలు తడిగుడ్డతో తుడిచాడు. మరికొందరు కప్పులు తీసుకువెళ్ళి శుభ్రం చేశారు. సిగరెట్ పీకల్ని గోడ అవతల పారబోశారు.

తిరిగి కళకళలాడుతున్న గదిలో సమావేశం అయ్యారు.

అప్పుడు మోహన్ మాట్లాడాడు.

"తలుచుకుంటుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. సిగ్గుగా కూడా ఉంది. ఇదిలా కావడానికి కారణం నేనే. ఇక్కడ పెద్ద సమావేశం జరుగుతూంది. నువ్వు చీటికి మాటికీ వచ్చి మమ్మల్ని డిస్టర్బ్ చేయకు అని మాలతితో నేనే అన్నా. చాలా సందర్భాలలో ఆమె చీపురు తీసుకుని ఇంకేం పని లేనట్లుగా ఊడుస్తున్నా, అంట్లు తోముకుంటున్నా నాకు చిరాకు కలుగుతుం దేది. ఈ అనుభవం తర్వాత నాకు అర్థమైందేమిటంటే ఈ సమాజంలో నిరంతరం దుమ్ము పేరుకుపోతుంటుంది. మేధావులు ఈ సమాజానికి ఎంత కంట్రిబ్యూట్ చేస్తారో అంత దుమ్ము సృష్టిస్తారనేది కూడా తెలిసింది.

అయితే మనం దుమ్మును సృష్టిస్తున్నామని మనకు తెలియదు. అలా తెలియకపోవడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది మనం సృష్టిస్తున్న దుమ్మునూ, ధూళినీ నిరంతరం ఎవరో ఒకరు శుభ్రం చేస్తుండడంవలన, రెండోది మనం ఏదో గొప్పదాన్ని సృష్టిస్తున్నామనే నమ్మకంతో ఉండడం వలన మనం సృష్టించేవి గొప్పవా, కాదా అనేది పక్కనుంచుదాం. ఒకానొక సమాజంలోని పరిణామాలు అర్థం చేసుకోవడానికి ఈ చిన్న అనుభవం ఉపయోగిస్తుందని నాకనిపిస్తూంది.

నిరంతరం డస్ట్ పోగవడం సహజం. అయితే నిరంతరం ఆ డస్ట్‌ను తుడిచివెయ్యాలి. అప్పుడే తళతళలాడుతున్న పరిసరాలా, మంచి వాతావరణం ఉంటాయి. అప్పుడే మనం సృష్టించేవి మనకు ఆనందాన్ని ఇస్తాయి, ఉపయోగపడతాయి. అలాకాకుండా నిరంతరం పోగవుతున్న దుమ్ము విషయంలో మనం నిర్లక్ష్యం వహించినా, ఆ పనిని ఎవరో ఒకరు చేయకపోయినా చివరికి మనమీదే వాటి పెత్తనం అధికమవుతుంది. మరో రకంగా మనమూ డస్ట్‌లో ఓ భాగం అయిపోతాం.

మనం ఇంతగా ఆరాటపడుతున్న ఈ అనూహ్య మార్పులన్నీ సరైన సమయంలో పోగైన చెత్తను శుభ్రం చేయకపోవడం వల్లనే అనుకుంటున్నా. అవి భావాలు కావచ్చు, సంస్కరణలు కావచ్చు, ఇంకేమైనా కావచ్చు. అయితే ఇదే సందర్భంలో మనం నిరాశ పడనవసరంలేదు. అందరం చీపుర్లు అందుకోవాలి. ఎక్కడ దుమ్ముఉంటే అక్కడ చీపురు ఉండాలి. శుభ్రం చేయాలి. నిరంతరం మన పరిసరాలను పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉంచుకోవాలి."

అందరూ మౌనంగా ఉండిపోయారు. చాలాసేపు వారిలో వారికి రకరకాల భావాలు కలిగాయి. కొత్త విషయమేదో మనసుకు స్ఫురించినట్లయింది.

మాలతి చిన్నిని పంపించింది.

"ఆంటీ!" అంటూ వచ్చాడు.

"ఏంటి నాన్నా?"

"భోజనాలు వడ్డించమంటారేమో కనుక్కోమంది అమ్మ."

"అలాగే!"

చిన్ని పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

"మనందరం పెద్ద పెద్ద విషయాల గురించి శ్రద్ధవహిస్తూ చిన్నవాటి గురించి నిర్లక్ష్యం చేస్తుంటాం. 'చీపురు'లాంటి విషయం మాత్రమే కాదు, అది పుచ్చుకునే మాలతిలాంటి వారూ మనకు ఆదర్శంకావాలి. తనలాంటివారు మనలా ముందుకు రాకపోవచ్చు. కానీ తమ ఇంట్లో మురికి విషయంలో రాజీపడరు. ఏమాత్రం దుమ్ము కనిపించినా శుభ్రం చేస్తారు. నిజానికి అంత మంచి వాతావరణం వారు కల్పించకపోతే మనం ఇంత స్వేచ్ఛగా పని చేయలేం" అంది వాసంతి.

"అవును." అన్నారంతా.

"అందుకే నాకు ఇప్పుడు 'చీపురు' ఎంత ఆదర్శమో, దాన్ని ఆయుధం చేసుకున్న మాలతీ అంతే ఆదర్శం" అంది వాసంతి.

"కాళ్ళు కడుక్కుంటానికి రండి" అంటూ ఆహ్వానించాడు చిన్ని అందరినీ.